# కథ పూర్తికాలేదు

రచన :
శ్రీపి. ఆర్. రావు

నాకు తెలిసినంతవరకూ యిద్దరి వ్యక్తులకు నేనువ్రాశే కథలు అసలు నచ్చనే నచ్చవు. ఒకరు శ్రీయుతులు మా అన్నగారు రెండో వ్యక్తి నా శ్రీమతి. విజయ అసలు నేనే కథ వ్రాశినా 'బాగులేదు బోరెత్తుతోందనడం' వారికి ఆలవాటై పోయింది. ఆ మధ్య ప్రజా మతలో అచ్చైన 'అంతర్ జ్వాలందరికీ' అనచ్చినా మా శ్రీ మతికి నచ్చలేదు. ఆమె అంటుంది కదా - ఇలా కథలపేరుతో రోజుకి ఒకర్నో– యిద్దర్నో చంపకపోతే చలంగారి లాగ శృంగారానికి ప్రాధాన్యమిస్తూ మంచి కామెడీలు వ్రాయకూడదూ?' మా అన్నగారు సరేసరి... ఆ మధ్య 'విరహాగ్ని' అంటూ కొంచెం శృంగారం కేళవిస్తూ ఒకకథ వ్రాస్తే బాగులేదన్నారు. చూడుచిన్నా! (మా అన్నగారు నన్ను అలాగే పిలుస్తారులెండి) 'శృంగారం క్షణికమైనది, విషాధాం నిత్యం కనిపించేది. శృంగారాన్ని క్షణికంగానే చూపిస్తూ విషాదాన్ని పతాక సన్నివేశాల్లో వింతగా ప్రవేశపెడితే ఎంతో బాగుంటుంది' అన్నారు మా అన్నగారు. అతనేమి చెప్పినా పచ్చి నిజమే. అతనిమీద నాకెప్పుడూ అ చంచలమైన విశ్వాసం అందుకనే 'విరహాగ్ని' కథను కొంచెం మార్చి తగుస్థాయిలో విషాదాన్ని చేర్చి 'అంతర్-జ్వాల'గా అందించాను. మా శ్రీ మతికి ఆ కథ నచ్చలేదు. ఆమధ్య వరుసగా అచ్చైనకథలన్నీ విషాదాంతలే చూడండి. యికమీదట మీరు విషాదాంతాలువ్రాస్తే నేను మీతో మాటాడే ఆడను' అంటూ మూతి బిగించింది. తప్పనిసరిగా ఆమె కోసమైనా కామెడీ ఆమెకు నచ్చిన రీతిలో వ్రాయాలని సంకల్పించాను.

నేను కామెడీ కథ వ్రాస్తే అనుభవంలేనివాడు అబద్ధం ఆడినట్టే ఉంటుందని నా అనుమానం. అయినా గతించిన నా జీవితంలోని ఒక అధ్యాయాన్ని వ్రాయడానికి ఉపక్రమించాను.

* * *

అవి క్రొత్తగా నాపెళ్లైన రోజులు. మూడు రాత్రుల్లు జరపడానికి ముహూర్తం లేక కొంచెం వెనకపడింది. అప్పట్లో కొంచెం ఆఫీసుపని మీద అత్తగారి ఊరు వెళ్లవలసివచ్చింది. వీధిలోనే ఎదురైన మామగారు అత్తగారు, రావోయి అంటూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. నాలుగువైపులా చిన్న చిరుదృష్టి విసిరాను. విజయ కనుపడుతుందేమోనని. ఫలితం శూన్యమే.

'అల్లుడుగారు స్నానానికి లేవండి' అన్న అత్తగారిమాటలుకు లేవక తప్పిందికాదు:

'అమ్మాయ్ నీళ్లుతోడి పెట్టు' అన్న అత్తగారి మాటలకు ప్రాణం లేచివచ్చింది. యిప్పుడు విజయని తప్పక కలుసుకోవచ్చని పెరట్లోకి పరిగెట్టాను...

నిండుగా నీళ్లుతో బాలిటి సబ్బుపెట్టి వెక్కిరించినట్లు కనిపించినాయి. తువ్వాలు ఎక్కడ కనిపించలేదు. బహుశ తువ్వాలు తేవడానికి వెళ్లిందేమో అనుకుంటూ సలసల మరుగుతున్న ఒంటిమీద రెండు చెంబులు చెన్నీళ్ళు పోసుకున్నాను. తలుపు ప్రక్కనగాజులు చప్పుడైతే తలెత్తి చూశాను. తలుపు చాటునుంచి తువ్వాలుతో సహా చెయ్యి బయిటికివచ్చింది.

క్రొత్త పెళ్లికూతురు సిగ్గు ఒలకబోస్తోంది కామోసు అనుకుంటూ తువ్వాలు అందుకో కుండా ఆమె చెయ్యనే అందుకుని పెరట్లోకి లాగేను. పకపకనవ్వుతూ ఎదురుపడింది మరదలు మాణిక్యం...

'పాపం అక్కనుకున్నావ్ కదూ! అని నవ్వుతూ ఇంట్లోకి పరిగెట్టింది' ఆ రేఫ్పూల్! మా అక్క అంత వేగిరం నీచేతికి చిక్కుతుందా అన్నట్టుందా నవ్వు...

మధ్యాహ్నం రెండుగంటలైంది. అత్తగారు మామగారు నిద్రపోతున్నారు. మాణిక్యం యింట్లో లేనట్టుంది. మా ఆవిడ నా గదిముందు నుంచే రీడింగ్ రూమ్‌వైపు వెళ్ళింది. వెల్తూ - వెల్తూ గాజులు చప్పుడుచేసింది. ఆ చప్పుడికి అర్థం నాకొక్కడికే తెలుసు. మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ రీడింగ్ రూమ్ చేరుకున్నాను. పుస్తకం పట్టుకుని చూస్తున్న నా కోసమే నిరీక్షిస్తున్నట్టనిపించింది. గబగబ వెళ్లి ఆమె మొహాన్ని నావైపు త్రిప్పుకున్నాను. ఆమె అభ్యంతరం చెప్పలేదు. పెదిమలను ముద్దుపెట్టుకో బోయాను.

'హాచ్! తుమ్ము వినిపించింది. ఎదురుగుండా గుమ్మంలో నిలబడి ఉంది మరదలు మాణిక్యం.. మా ఆవిడ సిగ్గుతో పారిపోయింది. తలుపు వేసుకుని రాని నా తెలివితక్కువ తనానికి చింతించాను. మరదలులేని మగవాడు ఎంత అదృష్టవంతుడుకదా అనిపించింది. ఏమీ ఎరగనట్టు వెళ్లిపోయింది మరదలు మాణిక్యం.

యింకా త్రిప్పులో విజయని కలుసుకునే అవకాశమే లేకపోయింది. కలసివచ్చిన అవకాశాలు కాస్త నా మరదలు పాడుచేసేసింది. కాని నెలతిరక్కుండానే ముహూర్తంపెట్టి మూడురాత్రులకు పిలవనంపారు మామగారు... బయలుదేరాను, అమ్మతో సహా...

* * *

ప్రతీ స్త్రీపురుషునకు తొలినాటి అనుభవం ఒక మలుపులాంటిది. ఆ మలుపులో పువ్వుల బాటవేసుకున్నా కంకరరాళ్లను పర్చుకున్నా జీవితాంతం అనుభవించ వలసినది మనమే. తొలినాటి అనుభవంలో ఏమాత్రం పొరపాటు జరిగినా అది జీవితాంతం మానని గాయమే.

ఆలోచనలకు అంతరాయం కల్గించింది. గాజులు చప్పుడు...తలుపు దగ్గర అపర రతీదేవిలా నిల్చునుంది విజయ. సహజంగా విజయ చాలా అందమైనది. శోభనపు సింగారంలో యింకా అందగా కనిపించింది. స్త్రీ తనంతట తానుగా చొరవతీసుకోదు. మనం చొరవతీసుకుంటే ఆమె తప్పుకోదు. తలుపులు గడియపెట్టి ఆమె బుగ్గమీద చిన్న చిటికివేసాను. మెల్లిగా నవ్వింది. అగరొత్తుల వాసన ముక్కుగరకొడుతూంటే మంచంమీద మల్లెలు నవ్వుతూ ఆహ్వానించాయి.

ఆమె అందంగా పెదిమెలందించింది. స్త్రీ పెదిమలందు మధువుంటుందని మహాపురుషులు వర్ణించారు. అది నిజమని నాకీ నాటికి ఋజువైంది. విజయ తన యౌవ్వన సౌందర్యాన్ని పూర్తిగా నాకు అంకితం చేసేసింది. కలం. ఆగిపోయింది. తరువాత ఏమిటి వ్రాయాలో పాలుపోలేదు. కథలో కొస మెఱుపు బాగోకపోతే కథ చప్పగా ఉంటుంది. ఆ కొస మెఱుపేదో విజయనే అడిగి

వ్రాస్తే బాగుంటుంది అనుకుంటూ నిద్రకుపక్రమించాను.

* * *

సూర్యకిరణాల తాకిడికి తెలివి వచ్చింది. రాత్రి ఆలస్యంగా పండుకోవడంవల్ల కళ్ళు మండుతున్నాయి. అమ్మ హాస్పిటల్ కి వెళ్ళినట్టుంది. ఎక్కడా అలికిడి లేదు నిన్నటినుంచి విజయకు నొప్పులు ప్రారంభమైనాయి. తొలికాన్పు కొంచెం కష్టమవ్వచ్చు అంది లేడి డాక్టరు. త్వరగా తయారై హాస్పటల్ కి వెళ్లాను ఎదురైంది లేడీ డాక్టరు.

'ఎలాగుంది' అడిగెను.

'పర్వాలేదు' చిన్న ఆపరేషను చెయ్యాలంది.

'మరేం ప్రమాదం వుండదు కదా...?'

'అబ్బే మరి మీరంత ఖంగారుపడితే ఎలాగండీ? మరేమీ ప్రమాదం ఉండదంటూ ఆపరేషను థియేటర్ వైపు వెళ్లిపోయింది.'

'ఆపరేషను సవ్యంగా జరిగింది కాని...ఆ పసి-కందు పొట్టలోనే చనిపోయాడు...ఆమె కొంచెం వీక్ గా వుంది. కొద్దిసేపట్లో తెలివి వస్తుంది' అని మరో పనిమీద వెళ్ళిపోయింది లేడీ డాక్టరు...

'ఆమెకు తెలివిరాగానే నా పసిపాపేది?' అంటే ఏం చెప్పేది. సాయంత్రం ఐదుగంటలైనా తెలివిరాలేదు. అమ్మ అన్ని దేముళ్ళకు మొక్కుకుంటోంది. నా ఆందోళనకు అంతే లేదు. రాత్రి ఏడుగంటల్కు తెలివి వచ్చింది. నన్ను దగ్గరకు పిలిచింది. ధైర్యం చెప్పాలని వెళ్లాను. కాని ఆమె నాతో చెప్పాలని ప్రయత్నించింది.....చెప్పలేకపోయింది. అప్పటికే ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయినాయి.

* * *

కావలిసిన వారంతా వచ్చేరు. జరగవలసినవి యథావిధిగా జరిగిపోయినాయి. టేబులు మీద సగం వ్రాశి వదిలిపెట్టిన కథ కాగితాన్ని ఆ పిల్లాడు అవతల పారవెయ్య బోయేడు... 'ఆగు...ఆ కథ...పూర్తికాలేదు...వాటిని ముట్టుకోకు..' అంటూ ఆ కాగితాల్ని తీసుకున్నాను...కాని ఆ కథ అసంపూర్తిగానే ఉండిపోయింది.





గమనింపుడు! గమనింపుడు!!

మీ మేలుకొరకు గమనింపుడు !!!

మీకు ఆకలి లేకున్నను, జీర్ణశక్తి లేకున్నను, ఎముకలు మాత్రము తెలియుచుండునట్లు శరీరము కృషించియుండినను, కన్నులు గుంటలు పడినను, జ్ఞాపకశక్తి కొంచమైనను లేకుండినను, మలబద్ధము చేత బాధపడుచుండినను, ధైర్యము, చురుకుదనము లేకుండినను, శుక్లము బొత్తిగా లేకుండినను, మేహరోగంచేత పీడింపబడి యుండినను మాయొక్క "ఆనంద కుసుమాకర లేహ్యం"మును తెప్పించి పుచ్చుకొందురేని 6 వారములలోగా వ్యాధులనుండి తప్పించుకొని సౌఖ్యము పొందగలరు.

200 గ్రాములకు రూ 3-50.

మలయాళ మెడికల్ హాల్. (రిజిస్టర్డు) పి. బి. నెం. 27. 189, వక్కీల్ కొత్తవీధి, మధురై.